క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



సుబ్రహ్మణ్యం కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో 3 వార్డుకు చెందిన వైసీపీ కార్యకర్త నాయుడు సుబ్రహ్మణ్యం మంగళవారం చనిపోయాడు. శనివారం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని పరామర్శించి రూ.1.50 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేసి బాధిత కుటుంబానికి భరోసాగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చురుగ్గా పనిచేసే సుబ్రహ్మణ్యం దూరం కావడం బాధాకరమన్నారు. సుబ్రహ్మణ్యం కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాదిరెడ్డి శ్రీనివాస్ ఉన్నారు.

పెంపుడు కుక్కలకు ర్యాబిస్ టీకా తప్పనిసరి



భీమవరంలో పెంపుడు కుక్కలకు టీకా వేస్తున్న దృశ్యం

భీమవరం: పెంపుడు కుక్కలకు ర్యాబిస్ వ్యాధి సోకకుండా ప్రతి ఏటా టీకాలు వేయించుకోవాలని భీమవరం మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి అన్నారు. ప్రపంచ ర్యాబిస్ దినోత్సవం సందర్భంగా శనివారం భీమవరం ఏరియా పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.సుధీర్‌బాబు మాట్లాడుతూ ర్యాబిస్ టీకా సృష్టికర్త లూయిస్ పాశ్చర్ వర్ధంతి సందర్భంగా వ్యాధిపై అవగాహన కల్పించడానికి ప్రపంచ ర్యాబిస్ దినోత్సవం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పశువైద్యులు జె.హాస్పెన్, పుండరీబాబు, రాబర్ట్ ప్రియాంక, సిబ్బంది నాగేశ్వరరావు, చిరంజీవి, గౌతమి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం(ప్రకాశంచౌక్): వికసిత్ భారత్–2047 స్వర్ణాంధ్రప్రదేశ్ కొరకు వివిధ శాఖలు డాక్యుమెంట్లను రూపొందించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ హాలులో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వర్ణాంధ్రప్రదేశ్‌కు జిల్లా తరపున వివిధ శాఖలు రూపొందించే డాక్యుమెంట్‌లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విజన్ డాక్యుమెంట్‌లో ప్రజలను కూడా భాగస్వాములను చేసామని, విద్యావంతులు, అనుభవజ్ఞులు తమ సలహాలు, సూచనలు అందజేయాలని కలెక్టర్ కోరారు. ఇప్పటికే వివిధ శాఖలు తయారుచేసిన డ్రాఫ్ట్ డాక్యుమెంట్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్షించి ఆయా శాఖలకు మార్పులు చేర్పులపై దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మోహనరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఆకివీడు: శిశు అభివృద్ధి ఆకివీడు ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు, నాలుగు ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రాజెక్టు అధికారిణి విజయరత్నం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేంపాడు–1లో ఓసీ కేటగిరిలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు, ఆకివీడు–4, ఉండి–6, ఆకివీడు–9, వంకాయలపాలెం–2లో ఆయా పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీలోపు దరఖాస్తులను ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తుకు అన్ని ధ్రువపత్రాల్ని అటెస్టెడ్ చేసి, జతచేయాలని ఆమె కోరారు.

రేపు కలెక్టరేట్ వద్ద పంచాయతీ కార్మికుల ధర్నా

భీమవరం అర్బన్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆంజనేయులు కోరారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో శనివారం పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే అప్రోచ్ రోడ్లకు నిధులు

- రూ.36 కోట్లు మంజూరు చేయించిన మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- 100 రోజులైనా దృష్టి పెట్టని కూటమి సర్కార్



అప్రోచ్‌లను నిర్మించాల్సిన వంతెన

భీమవరం(ప్రకాశం చౌక్): తీరప్రాంత గ్రామాలు, పట్టణ ప్రజలకు కల సాకారం చేయడానికి 2004 నుంచి 2009 వరకు మొదటిసారి ఎమ్మెల్యేగా పనిచేసిన గ్రంధి శ్రీనివాస్ నాడు తీర ప్రాంత ప్రజల సౌకర్యార్థం డెల్టా ఆధునికీకరణలో భాగంగా నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో యనమదుర్రు డ్రెయిన్‌పై భీమవరం చేపల మార్కెట్, గొల్లవానితిప్ప, తోకతిప్ప ప్రాంతాల్లో మూడు వంతెనలు నిర్మాణం చేపట్టారు. అప్పటికి కాంట్రాక్టర్లు వంతెనల నిర్మాణం పూర్తి చేశారు. తర్వాత ఎమ్మెల్యేగా గ్రంధి శ్రీనివాస్ లేకపోవడంతో వంతెనల అప్రోచ్‌ల నిర్మాణం ఆగిపోయింది. దాంతో మూడు వంతెనలు కూడా నిరుపయోగం మారాయి.

పదేళ్లు ఎమ్మెల్యే అయినా పట్టించుకోని వైనం

ప్రస్తుత ఎమ్మెల్యే అంజిబాబు పదేళ్ల పాటు భీమవరం ఎమ్మెల్యేగా పని చేసినప్పటికీ ఈ వంతెనలకు అప్రోచ్‌లను నిర్మించలేకపోయారు. కనీసం నిధుల మంజూరు ప్రతిపాదనలు కూడా చేయకపోవడంతో పదేళ్లకు పైనే వంతెలు నిరుపయోగంగా ఉన్నాయి.

టెండర్ల దశ వరకు

2019లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన గ్రంధి శ్రీనివాస్ వంతెనల అప్రోచ్‌ల నిర్మాణానికి చొరవ తీసుకున్నారు. సమస్యను నాటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తొలుత ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.15.30 కోట్లు మంజూరు చేయించారు. డిజైన్లను పూర్తి చేసి శాశ్వత ప్రాతిపదికన అప్రోచ్‌ల నిర్మాణానికి సిద్ధమవుతున్న తరుణంలో డిజైన్లను మార్చి అప్రోచ్‌లు నిర్మిస్తే ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటాయని గ్రంధి శ్రీనివాస్ భావించారు. కొత్త డిజైన్లతో అప్రోచ్ నిర్మించాలని మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.36 కోట్లు మంజూరు చేయించారు. డిజైన్లుకు సంబంధించి ఆయన తన సొంత ఖర్చులు కూడా చేశారు. అప్రోచ్‌ల కోసం ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించి పంపించిన డిజైన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. దీంతో అప్రోచ్‌ల పనులకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. టెండర్లు ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో ఎన్నికల కోడ్ రావడంతో టెండర్లు నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో మంజూరైన నిధులు రూ.36 కోట్లు అప్రోచ్‌ల నిర్మాణం కోసం సిద్ధం ఉన్నాయని వాటిని ఈ ప్రభుత్వం బడ్జెట్‌లో పెట్టి పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అప్రోచ్‌ల నిర్మాణం డిజైన్లు

వైఎస్సార్ సీపీ నేతల పూజలు



ఉండి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన వైఎస్సార్ సీపీ నాయికులు, కార్యకర్తలు

ఉండి: ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించు స్వామి అంటూ ఉండి వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చేందుకు నోటికొచ్చిన వాగ్దానాలు చేసిన చంద్రబాబు, ఇచ్చిన హామీలు అమలు చేయలేక కలిగియు ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై వివాదం చేస్తున్నారని మండిపడ్డారు. లడ్డూలో కల్తీ జరగలేదని స్వయంగా టీటీడీ ఈవో చెబుతున్నా వినకుండా నోటికొచ్చినట్టు మాట్లాడుతూ చంద్రబాబు దుర్మార్గ రాజకీయాలకు తెరతీసారని అన్నారు. రాష్ట్ర జానపద కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, సీనియర్ నాయకుడు గుండాబత్తుల సుబ్బారావు, బడుగు బాలాజీ, గలావిల్లి ధనుంజయ, శేషాద్రి శ్రీను మాట్లాడుతూ సూపర్ సిక్స్ అంటూ చేసిన వాగ్దానాలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రజలు ఎదురుతిరుగుతున్న సంగతి గమనించిన చంద్రబాబు తన మార్కు రాజకీయాలకు తెరతీశాడని అన్నారు. ప్రజల మైండ్ డైవర్ట్ చేసేలా తిరుపతి లడ్డూ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారన్నారు. చంద్రబాబుకి మంచి బుద్ధి ప్రసాదించాలని ఆ స్వామిని వేడుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు కరిమెరక మల్లిఖార్జున, కరిమెరక శివనాగరాజు, అంగర రాంబాబు, రాయి సతీష్, జంపా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా మాధవరాజు

పాలకోడేరు: పాలకోడేరు మండల ట్రాన్స్‌కో ఏఈగా ఎం.మాధవ రాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఆర్‌వీ అప్పారావు వీరవాసరం బదిలీ కాగా ఉండి మండలం నుంచి మాధవరాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

స్వచ్ఛతపై అవగాహన

పాలకోడేరు: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పెన్నాడ భీమవరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గొరగనమూడి గ్రామంలో మారథాన్ రన్ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పర్తి సురేష్ ప్రారంభించారు. ఈ ర్యాలీలో సుమారు 500 మంది వాలంటీర్లు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామ ప్రజలకు స్వచ్ఛత గురించి అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఏబీఎస్ఆర్ మనోహర్, అకడమిక్ డీన్ డాక్టర్ కురెళ్ళ భాస్కరరావు, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి



ఆకివీడు: భగత్ సింగ్ జయంతిలో పాల్గొన్న విద్యార్థులు



భీమవరం: భగత్‌సింగ్ పోరాటాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని పటవర్తి మంగయ్య గుప్తా మునిసిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో శనివారం భగత్‌సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా స్పేస్ సంస్థ అధ్యక్షుడు గోపిశెట్టి మురళీకృష్ణారావు మాట్లాడుతూ భారతదేశ బానిస సంకెళ్లు పోవాలని పోరాటం చేసిన యువ స్వతంత్ర సమరయోధుడు భగత్‌సింగ్ అన్నారు. కార్యక్రమంలో ఇండిగుల రామకృష్ణ, ఐ.రంగయ్య నాయుడు, రమణ, కంతంశెట్టి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళి

ఆకివీడు: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాల్ని సైతం లెక్కచేయకుండా బ్రిటిష్ పాలకుల్ని గడగడలాడించిన విప్లవ వీరుడు భగత్ సింగ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీ.ధనుష్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రైవేటు కళాశాలలో శనివారం భగత్‌సింగ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు బీ.రాంబాబు, రవితేజ, బీవీ.వర్మ, తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

కాళ్ల: బైక్ చోరీపై కాళ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భీమవరం మండలం తాడేరు గ్రామానికి చెందిన జె.కృష్ణకుమార్ శుక్రవారం రాత్రి ‘దేవర’ సినిమా చూడటానికి కాళ్ల గ్రామంలోని థియేటర్‌కు వచ్చాడు. తన మిత్రుడికి చెందిన జియో పాయింట్ షాపు ఎదురుగా ‘ఏపీ 39 బీసీ 2399’ నెంబర్ గల పల్సర్ బైక్‌ను పార్క్ చేసి వెళ్లాడు. సినిమా చూసి వచ్చేసరికి బైక్ లేకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

కూల్ డ్రింక్ షాప్‌లో చోరీపై కేసు నమోదు

కాళ్ళ మండలం బొండాడ గ్రామానికి చెందిన జి.సుబ్రహ్మణ్యం కూల్ డ్రింక్ షాపులో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దొంగలు షాపు తాళాలు బద్దలుగొట్టి షాపులో ఉన్న కూల్ డ్రింక్స్, సిగరెట్ ప్యాకెట్లు దొంగిలించుకుపోయారని షాపు యజమాని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.శ్రీనివాసరావు తెలిపారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన



ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

భీమవరం: మంచి ఆరోగ్యంతోనే విద్యార్థులకు ఉన్నత చదువులు, ఉద్యోగాలకు అవకాశం ఉంటుందని గైనకాలజిస్ట్ డాక్టర్ ఆర్.జగదీశ్వరి అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థినులకు ప్రత్యేకంగా ఆరోగ్య సమస్యలపై హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఫర్ యంగ్ ఉమెన్ అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. మహిళలు దయనందిన జీవితంలో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే తమ జీవితంలో ఎలాంటి అలవాట్లతో ముందుకెళ్లాలో వివరించారు. కొన్ని వ్యాధులు వాటి లక్షణాలను వివరించి వాటిని గమనించి వెంటనే చికిత్స పొందితే ప్రాథమిక దశలోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని అందుకోగలరన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రత్యేకంగా విద్యార్థినులు తల్లిదండ్రులకు దూరంగా హాస్టల్స్‌లో ఉన్నప్పుడు ఆరోగ్యం విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అందువల్లనే మహిళావైద్యులతో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు డాక్టర్ జగదీశ్వరి చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ పి.భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి



కుప్పనపూడి శివారు తాళ్లకోడులో ఇళ్ల నిర్మాణంపై బాధితులు మొరపెట్టుకుంటున్న దృశ్యం

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి, దుంపగడప, అయిభీమవరం గ్రామాల్లో మన ఇల్లు–మన గౌరవం కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో లబ్ధిదారులు తమకు ఇళ్ల స్థలాలు ఇచ్చినా కట్టుకునే పరిస్థితిలో లేమని వాపోయారు. ప్రభుత్వం రూ.4 లక్షలు సహాయం అందజేస్తానని ప్రకటించిందని, ఆ సొమ్ము వెంటనే మంజూరు చేయాలని కోరారు. కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని లేఅవుట్‌లో మౌళిక వసతులు సమకూర్చలేదన్నారు. రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని వారు వాపోయారు. లేఅవుట్‌లో ఇప్పటికే కుప్పపూడి గ్రామానికి చెందిన 116 మందిలో 70 మంది ఇళ్లు నిర్మించుకున్నారని, అజ్జమూరు గ్రామానికి 46 మంది లబ్ధిదారుల్లో 12 మంది ఇళ్లు నిర్మించుకున్నామని మాకు మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అయిభీమవరం గ్రామ సర్పంచ్ గాలి సామ్రాజ్యం, సర్పంచ్‌లు ముత్యాల అనురాధ, ముద్దే విశ్వేశ్వరరావు, కార్యదర్శి ఆనంద భూషణం, డీటీ ఫరూక్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిత్త దూడల అక్రమ తరలింపుపై కేసు

ఆకివీడు: ఉండి పశువుల సంత నుంచి చిలకలూరు పేటకు అక్రమంగా తరలిస్తున్న గిత్త దూడల్ని అదుపులోకి తీసుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి లారీలో 25 ఆవు, గేద గిత్త దూడల్ని తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వాటిని అదుపులోకి తీసుకుని సంబంధిత వాహనదారుడిపై కేసు నమోదు చేశామన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి



జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: గుర్రం జాషువా ఆర్థిక అసమానతలను రూపుమాపడానికి శక్తి వంచన లేకుండా కృషి చేశారని అరసం జిల్లా అధ్యక్షుడు వేల్పుల నాగేశ్వరరావు, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారామప్రసాద్, కళారంజని అధ్యక్షుడు జవ్వాది దాశరథి శ్రీనివాస్ అన్నారు. శనివారం భీమవరంలోని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో గుర్రం జాషువా జయంతి సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు జాషువా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చాన్ బాష, ఎం.శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి



భీమవరం మునిసిపల్ కార్యాలయంలో మంచినీటి సమస్యను వివరిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలో 12వ వార్డు వైయస్సార్ కాలనీలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌కు శనివారం సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ నాయకుడు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ గత ఏడాదికాలంగా బస్ స్టాప్ ఎదురుగా రోడ్డుపై డ్రైనేజీ నీరు మంచినీటి పైపుల్లో కలిసి మురుగునీరు వస్తుందని దీనిపై అనేక పర్యాయాలు అధికారులు దృష్టికి తెచ్చినా సమస్యను పరిష్కరించడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. తాగు నీటిలో మురుగనీరు కలిసిపోవడం కారణంగా అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే స్పందించిన కమిషనర్ రామచంద్రారెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, మరియమ్మ, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ వివాదంపై సీబీఐతో దర్యాప్తు చేయించాలి



ఉండిలో హిందూధర్మ పరిరక్షణ సభ్యులు మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: తిరుపతి లడ్డూ వ్యవహారంలో ఎవరు తప్పు చేశారో వారికి కఠినంగా శిక్షపడాలని, ముందు సీబీఐతో ఈ వివాదంపై దర్యాప్తు చేయించాలని హిందూ ధర్మ పరిరక్షణ సభ్యులు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఉండి రాజులపేటలోని శివాలయం వద్ద నుంచి ఉండి సెంటర్ మీదుగా వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఉండి సెంటర్‌లో మానవహారాన్ని నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ టీటీడీలో వేంకటేశ్వరస్వామివారి ప్రసాదం లడ్డూ కల్తీ అయ్యిందని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు సీబీఐతో దర్యాప్తు చేయించాలని కోరారు. ముఖ్యంగా దేవాలయాల్లో దర్శనం టిక్కెట్లు రద్దు చేసి భక్తులకు పూర్తిగా ఉచితంగా దర్శనం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఇటీవల కాలంలో ఆలయాలను దర్శించాలంటే సామాన్య భక్తులకు తీవ్ర ఇబ్బందులు తప్పట్లేదని అన్నారు. దర్శనం టిక్కెట్లు, ప్రసాదం రేట్లు విపరీతంగా పెరిగిపోయాయని అన్నారు. వెంటనే ధరలు తగ్గించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. అన్యమతస్తులను విధులకు అనుమతి లేకుండా చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హిందూధర్మ పరిరక్షణ సభ్యులు సన్నిధిరాజు చలపతిరావు, నల్లా ప్రసాద్, ఆళగిరి అనంద్, పరంసెట్టి ఆంజనేయులు, దంగేటి రామలింగేశ్వరరావు, సత్యవాడ శ్రీనివాస్, కర్రి శ్రీను, పెద్దింటి బాబు తదితరులు పాల్గొన్నారు.

144 సెక్షన్ వెంటనే ఎత్తివేయాలి



తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరంలో పోలీసు 30 యాక్ట్, 144 సెక్షన్ వెంటనే ఎత్తివేయాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ ఆర్.రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళితసంఘాల నాయకులు తాళ్లూరి మధు, గంటా సుందరకుమార్ మాట్లాడుతూ కాళ్ల మండలం ఏలూరుపాడులో ఫ్లెక్సీ వివాదానికి సంబంధించి ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు బహిరంగ క్షమాపణ చెప్పాలని అంబేడ్కర్ వాదులు చేస్తున్న ఆందోళన కార్యక్రమానికి పోలీసులు ఆంక్షలు విధించడం దారుణమన్నారు. ఫ్లెక్సీ వివాదంలో దళితులు శాంతియుతంగా ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారని ఇలాంటి తరుణంలో ఆంక్షలు విధించడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణం పోలీసు యాక్ట్, 144 సెక్షన్ తొలగించాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బిరుదుగడ్డ రమేష్, కాటం స్టాన్లీరాజు, ధనరాజు, పట్టెం శుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

భీమవరం అర్బన్: పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన జీవితం పొందవచ్చని భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం అన్నారు. భీమవరంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో తాడేరు సెక్టర్ పరిధిలో రూరల్, అర్బన్ అంగన్‌వాడీ కార్యకర్తలకు, తల్లులకు, గర్భిణులకు పోషకాహార మాసోత్సవాలలో భాగంగా శనివారం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ లక్ష్మీకాంతం మాట్లాడుతూ గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సరళ, డి.అనిలకుమారి, కార్యకర్తలు సీహెచ్ మహాలక్ష్మి పాల్గొన్నారు.

వీరవాసరంలో..

వీరవాసరం: బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం వీరవాసరం గ్రామంలో భారతి కాన్వెంట్‌లో బాలికలందరికీ పౌష్టికాహారం మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుడ్ టచ్,బ్యాడ్ టచ్‌పై కూడా అవగాహన కల్పించారు. పోక్సో చట్టం, మహిళా చట్టాలు పై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ పీబీవీఎల్ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

పొగాకుకు దూరంగా ఉండాలి



రోగులకు క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: పొగాకు ఉత్పత్తులను ఉపయోగించుకునేవారు ఈ ప్రాంతంలో అధికంగా ఉన్నారని వారికి క్యాన్సర్ అనేది సర్వసాధారణమని సాధ్యమైనంత వరకు పొగాకుకు దూరంగా ఉండాలని హైదరాబాద్ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్ స్పెషల్ గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రావణి అన్నారు. భీమవరం మండలంలోని వెంపలో శ్రీరామపురం, రాజుల గరువు గ్రామస్తులకు శనివారం క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్‌ను నిర్వహించారు. అంకాలజిస్ట్ డాక్టర్ సులోచన రాణి, ఫిజీషియన్ డాక్టర్ రవి శంకర్, రేడియాలజీ డాక్టర్ ప్రదీప్‌లు సుమారు 300 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ మహిళలకు బ్లీడింగ్, వైట్ డిశ్చార్జ్‌లు ఎక్కువైనా నిర్లక్ష్యం చేయవద్దని వెంటనే వైద్యులను సంప్రదించి వైద్యం చేయించుకోవాలన్నారు. గొంతుకలో ఏదైనా ఆహారాన్ని మింగడానికి ఇబ్బంది ఏర్పడితే చికిత్స చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంప త్రి సభ్య కమిటీ మాజీ ఛైర్మన్ కలిదిండి మురళీకృష్ణంరాజు, గొట్టుముక్కల భీమరాజు, కలిదిండి రామచంద్రరాజు, అల్లూరి కృష్ణంరాజు, కలిదిండి బంగార్రాజు, చంద్రరాజు, ఫణిరాజు, బలరామరాజు, కఠారి కాశీరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కోరుకొల్లులో ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరం

పాలకోడేరు: కోరుకోల్లు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం నందు ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు మంతెన వెంకట ప్రహ్లాదరాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంతెన యోగీంద్ర కుమార్ బాబు తెలిపారు. కోరుకొల్లు, మైప గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.